# భారత దేశంలో... పన్నుల వ్యవస్థ!

ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయటానికి అవసరమైన విత్తవనరుల సేకరణలో భాగంగా.. పన్ను ఆదాయాన్ని పెంచుకోవడానికి వీలుగా.. పన్ను-జీడీపీ నిష్పత్తిని పెంచాలి. ఇందులో భాగంగా.. ప్రత్యక్ష పన్ను విధానాన్ని పటిష్టపరచాలి. పరోక్ష పన్ను రేట్లు ఎక్కువైతే... సమానత్వ సూత్రానికి విఘాతం కల్గుతుంది. పన్నుల పరిధిని విస్తరించి.. అన్ని వర్గాల ప్రజలు పన్నుల పరిధిలోకి వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటే.. ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది.. దాంతోపాటు పన్ను భారాన్ని వివిధ ఆదాయ వర్గాల మధ్య న్యాయబద్ధంగా పంపిణీ చేయవచ్చు!! ఆర్థిక ప్రగతిని వేగవంతం చేయటానికి అవసరమైన పథకాలు, ప్రాజెక్టుల రూపకల్పనకు తగిన విత్తవనరులు అవసరం. స్థూల ఆర్థిక విధాన సాధనాలలో... పన్ను విధానం కీలకమైంది. ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వం ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధానం రూపొంది స్తుంది. ఆదాయ,సంపదల అసమానతలు తగ్గించటంద్వారా... పొదుపును, పెట్టుబడులను ప్రోత్సహించి... ఆర్థిక స్థిరీకరణ సాధించేందుకు ప్రభుత్వం సరైన పన్నుల విధానాన్ని రూపొందించుకోవాలి. మనదేశంలో విధించే పన్నులు.. రెండు రకాలు... అవి.. 1) ప్రత్యక్ష పన్నులు (ఆదాయపు పన్ను, కార్పొరేషన్ పన్ను, మూలధన రాబడి పన్ను, సంపద పన్ను, ఎస్టేట్ సుంకం, బహుమతి పన్ను). 2)పరోక్ష పన్నులు (యూనియన్ ఎక్సైజ్ డ్యూటీలు, కస్టమ్స్ సుంకం). బదిలీ చేయడానికి వీలు లేనివి ప్రత్యక్ష పన్నులు. వీటిని ప్రభుత్వం ఎవరిపైన విధిస్తుందో.. వారే నేరుగా ప్రభుత్వానికి చెల్లించాలి. పరోక్ష పన్నులను తొలుత వ్యాపార సంస్థపై విధించినప్పటికీ... ఆ పన్నుభారం చివరకు వ్యక్తుల పైకి (కొనుగోలుదార్లు) బదిలీ అవుతుంది. భారత దేశం వనరుల సమీకరణ కోసం ఎక్కువగా పరోక్ష పన్నులపైనే ఆధారపడింది. దేశంలో ప్రత్యక్ష పన్నుల విత్తబేస్ (Tax base) ఇరుకుగా ఉండటం వల్ల ఆర్థిక ప్రగతికి అవసరమైన వనరుల సేకరణ ఆశించిన మేర జరగలేదు. ఈ 'పన్ను చెల్లించే వ్యక్తికి వస్తువు ధరలో పన్ను శాతం ఎంతో సాధారణంగా తెలిసే అవకాశం లేదు. కాబట్టి ఈ పరోక్ష పన్ను విధానంలో... మానసికంగా ప్రజలపై ఒత్తిడి ఉండదు. అందువల్ల ప్రత్యక్ష పన్నుల కంటే పరోక్ష పన్నులను విధించడమే సముచితం' అని డబ్ల్యూ.ఎ.లూయిస్ అభిప్రాయపడ్డారు. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో... ఆర్థిక అసమానతలు రూపుమాపటానికి పురోగామి పన్నుల విధానం సరైందని ఆర్థికవేత్తల అభిప్రాయం.

### పన్నులు- కేంద్రం, రాష్ట్రాల వాటా:

పన్నుల విషయంలో... కేంద్రం, రాష్ట్రాల మధ్య భవిష్యత్తులో.. వివాదాలు తలెత్తకుండా చూసేందుకు రాజ్యాంగపరమైన నిర్ణయాలు చేశారు. 2000, మార్చిలో రాజ్యాంగంలోని 8వ సవరణ రావటానికి ముందు... కార్పొరేషన్ పన్ను, కస్టమ్స్ సుంకం.. కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉండేవి. మొత్తం కేంద్ర పన్నుల రాబడిలో... వీటి వాటా 50 శాతం. ప్రస్తుతం ఈ రాబడిని కేంద్రం, రాష్ట్రాలు... ఇతర కేంద్ర పన్నుల రాబడి మాదిరిగానే పంచుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని పన్నులు విధించి... వాటి ద్వారా లభించే ఆదాయాన్ని తమ కార్యకలాపాలకు వినియోగించుకోవచ్చు.. అవి... అమ్మకం పన్ను (వ్యాట్), రాష్ట్ర ఎక్సైజ్ పన్ను, భూమి శిస్తు, వ్యవసాయ ఆదాయంపై పన్ను, వినోదపన్ను. కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించి, వసూలు చేసి... వచ్చిన ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో పంచుకుంటుంది.. అవి... యూనియన్ ఎక్సైజ్ డ్యూటీలు, ఆదాయపు పన్ను. ఆర్థిక సంఘం సిఫార్సు మేరకు... వీటి ఆదాయాలను కేంద్రం, రాష్ట్రాలు పంచుకుంటాయి. కొన్ని పన్నులను విధించే అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉంది. వీటి ద్వారా వచ్చే రాబడి మొత్తం రాష్ట్ర ప్రభుత్వాలకు చెందుతుంది. అవి.. న్యూస్ పేపర్ల అమ్మకాలు, కొనుగోలుపై పన్ను, బహుమతి పన్ను, అడ్వర్‌టైజ్‌మెంట్‌లపై పన్ను, వ్యవసాయ భూములు మినహాయించి, ఇతర సంపదపై ఉండే ఎస్టేట్ డ్యూటీ, టెర్మినల్ టాక్స్, రైల్వే సరకులు, ప్రయాణ ఛార్జీలపై డ్యూటీలు. కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధించినప్పటికీ... వాటిని వసూలు చేసుకొనే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదే. స్టాంపు డ్యూటీలు, వ్యాట్, డ్రగ్స్, కాస్మొటిక్స్‌పై విధించే పన్నురేట్లను కేంద్రం నిర్ణయిస్తుంది.. వీటిని సంబంధిత రాష్ట్రాలు వసూలు చేసుకుంటాయి.

### ప్రత్యక్ష, పరోక్ష పన్ను ఆదాయాలు:

ప్రణాళికా కాలంలో... పన్నుల రాబడిలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. పన్నుల ఆదాయం (కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కలిపి) 1950-51లో రూ.627 కోట్ల నుంచి.. 1960-61లో రూ.1,350 కోట్లకు, 2003-04లో రూ.4,15,283 కోట్లకు, 2006-07లో రూ.6,99,135 కోట్లకు పెరిగింది. 2007-08 బడ్జెట్ అంచనా ప్రకారం... పన్ను ఆదాయం రూ.8,34,094 కోట్లుగా నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వాల సొంత పన్నుల రాబడి.. 1951-52లో రూ.280 కోట్ల నుంచి.. 1980-81లో రూ.10,400 కోట్లకు.. 2006-07లో రూ.2,57,080 కోట్లకు.. 2007-08లో రూ.2,94,038 కోట్లకు పెరిగింది. పన్నుల రాబడిలో ప్రత్యక్ష, పరోక్ష పన్నుల నిష్పత్తి 1950-51లో 40:60. కాగా 1980-81లో ఇది 18:82కు తగ్గింది. పన్నుల సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత ప్రత్యక్ష, పరోక్ష పన్నుల నిష్పత్తి మెరుగయింది. ఈ నిష్పత్తి 2002-03లో 28:72. కాగా, 2006-07లో 48:52కు పెరగగా... 2008-09లో 46.93 : 53.07గా ఉంటుందని అంచనా. అమెరికా, కెనడా లాంటి దేశాల్లో... పన్నుల రాబడిలో ప్రత్యక్ష పన్నుల వాటా.. 2/3వ వంతు ఉంటుంది. బ్రిటన్‌లో ప్రత్యక్ష పన్నుల ఆదాయం 60 శాతం. కాగా, జర్మనీ, స్వీడన్, డెన్మార్క్ వంటి దేశాల్లో.. ఈ ఆదాయం 40 శాతం నుంచి 60 శాతం వరకు ఉంటుంది. భారతదేశంలో ఇటీవల కాలంలో.. ప్రత్యక్ష పన్నుల రాబడి పెరగటం

శుభపరిణామంగా భావించవచ్చు. ప్రత్యక్ష పన్నురేట్లు పురోగామిగా ఉండటంవల్ల... ఆదాయ, సంపదల పరంగా అసమానతలు తగ్గి.. సామాజిక న్యాయం సిద్ధిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాల పన్నుల రాబడిలో 60 శాతానికి పైగా అమ్మకం పన్ను ద్వారానే లభిస్తుంది. 2005, ఏప్రిల్1 నుంచి చేపట్టిన పన్ను సంస్కరణల్లో భాగంగా... అమ్మకం పన్ను స్థానంలో విలువ ఆధారిత పన్ను (వ్యాట్) ప్రవేశపెట్టారు. వ్యాట్ అమలు సంతృప్తికరంగా ఉన్నట్లు తెలుస్తుంది. 2005-06లో వ్యాట్ అమలుచేసే 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పన్ను రాబడి.. 2004-05తో పోల్చినప్పుడు 2005-06లో 13.8 శాతం పెరిగింది. అదేవిధంగా 2006-07లో వ్యాట్ అమలుచేసిన 31 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పన్ను ఆదాయంలో... 21 శాతం వృద్ధి కనిపించింది. 2007-08 ఏప్రిల్-సెప్టెంబర్‌లో.. ఈ పన్ను అమలుచేసిన 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో పన్ను రాబడి.. 2006-07 ఏప్రిల్-సెప్టెంబర్‌తో పోల్చినపుడు.. 14.6 శాతం వృద్ధి చూపింది.

భారతదేశంలో పన్ను నిర్మాణంలో మార్పును పరిశీలించగా... ఆదాయం పన్ను రాబడి.. 1950-51లో రూ.140 కోట్ల నుంచి 1980-81లో రూ.2,817కోట్లకు... 2007-08లో బడ్జెట్ అంచనా ప్రకారం... రూ.1,18,320 కోట్లకు పెరిగింది. 2008-09 బడ్జెట్‌లో ఆదాయపు పన్ను రాబడి రూ.1,38,314 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. కార్పొరేషన్ పన్ను ద్వారా రాబడి 1950-51లో రూ.40 కోట్ల నుంచి.. 1980-81లో రూ.1,310 కోట్లకు... 2007-08లో రూ.1,68,400 కోట్లకు పెరిగింది. 2008-09 బడ్జెట్‌లో ఈ పన్ను ద్వారా రాబడి రూ.2,26,361 కోట్లుగా అంచనా వేశారు. కేంద్ర ఎక్సైజ్ పన్ను రాబడి 1950-51లో రూ.70 కోట్లనుంచి.. 1980-81లో రూ.3,720 కోట్లకు.. 2007-08లో రూ.1,72,947 కోట్లకు చేరుకుంది. ఇది 2008-09 బడ్జెట్‌లో రూ.1,37,874 కోట్లకు చేరుకుంటుందని అంచనా. ఎగుమతి, దిగుమతులపై విధించే కస్టమ్స్ సుంకం ద్వారా రాబడి 1950-51లో రూ.160 కోట్ల నుంచి.. 1980-81లో రూ.3,409 కోట్లకు... 2007-08లో రూ.1,00,766 కోట్లకు పెరిగింది. అది 2008-09లో రూ.1,18,930 కోట్లకు చేరుకుంటుందని అంచనా. ఇటీవల కాలంలో.. అనూహ్యంగా రాబడి పెరిగిన సర్వీస్ టాక్స్ ద్వారా.. 1994-95లో రూ. 407 కోట్ల ఆదాయం లభించింది. అది 2007-08లో రూ.50,603 కోట్లకు పెరిగింది. 2008-09 బడ్జెట్‌లో సర్వీస్ టాక్స్ ద్వారా... రూ. 64,460 కోట్ల ఆదాయం లభిస్తుందని అంచనా.

## పన్ను - జీడీపీ నిష్పత్తి:

దేశంలో ప్రణాళికలు ప్రారంభమైనప్పుడు.. 1950-51లో పన్ను-జీడీపీ నిష్పత్తి 5.9 శాతంగా ఉండేది. ఈ నిష్పత్తి 1990-91 వరకు పెరిగి, ఆ తర్వాత కాలంలో తగ్గింది. 1990-91లో పన్ను-జీడీపీ నిష్పత్తి 16.4 శాతం నుంచి.. 2002-03లో 14.4 శాతానికి తగ్గి... 2006-07లో 17.3 శాతానికి.. 2007-08లో 17.8 శాతానికి పెరిగింది (కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో కలిపి). 1970-71 వరకు మన దేశంలో పన్నుభారం.. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే ఎక్కువగా లేదు. అయితే, 1980 లలో పన్నుభారం పెరగడం ప్రారంభమైంది. వడ్డీ చెల్లింపులపై వ్యయం పెరగడం... సబ్సిడీలు, రక్షణపై వ్యయం పెరగడం.. ప్రభుత్వరంగ సంస్థల్లో లాభదాయకత లోపించటం... వంటి కారణాల వల్ల పన్నుభారం పెరిగింది. 1990-91 నుంచి 2008-09 మధ్యకాలంలో... పన్ను- జీడీపీ నిష్పత్తి తగ్గటానికి పరోక్ష పన్నుల నుంచి ఆదాయం తగ్గటమే కారణం. అభివృద్ధి చెందిన దేశాల్లో... పన్నుల ద్వారా వచ్చే ఆదాయం.. ఆయా దేశాల స్థూల జాతీయోత్పత్తికి సంబంధించి స్వీడన్‌లో 41 శాతం, ఫ్రాన్స్‌లో 39 శాతం, బ్రిటన్‌లో 33 శాతం, అమెరికా, కెనడాలలో 29 శాతంగా ఉండటం... మనదేశంలో పన్నుల రాబడిని ఇంకా పెంచుకోవలసిన ఆవశ్యకతను తెలుపుతోంది. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో.. అధిక పన్నురేట్ల కారణంగా పెట్టుబడి సామర్థ్యం దెబ్బతింటుంది. మూలధన సంచయనం పెంచటం ద్వారా... ఆర్థిక ప్రగతి సాధ్యమయ్యేవిధంగా పన్నుల విధానాన్ని అవలంబించాలి. అనుత్పాదకమైన ప్రయివేటు వినియోగాన్ని తగ్గిస్తూ... ప్రభుత్వ ఆదాయం పెరిగే విధంగా పన్ను విధానం ఉండాలి. వ్యయ పన్ను సక్రమంగా అమలు జరిగితే... మూలధన సాంద్రత పరిశ్రమలు నిరుత్సాహానికి గురవుతాయి. తద్వారా శ్రమ సాంద్రత పరిశ్రమలకు ప్రోత్సాహం లభించి.. నిరుద్యోగం తగ్గుతుంది!!

- వస్తువుపై ఉన్న డిమాండ్ వ్యాకోచత్వాన్ని బట్టి పన్ను ప్రభావం అంచనా వేయాలన్నది?
  - డాల్టన్
- క్షీణ ప్రతిఫలాలు ఉన్న పరిశ్రమపై పన్ను విధించాలన్నది ఎవరు?
  - మార్షల్
- సంపద పన్నును సిఫార్సు చేసింది?
  - కాల్డర్
- 13వ ఆర్థిక సంఘం అధ్యక్షుడు?
  - విజయ్ కేల్కర్
- ప్రత్యక్ష పన్నుల కంటే పరోక్ష పన్నులను విధించడం మంచిది అని చెప్పింది?
  - W.A. Lewis
- 1953లో ఏర్పాటైన పన్ను విధాన విచారణ సంఘం అధ్యక్షుడు? - జాన్ మథాయి
- 2002లో పన్నుల సంస్కరణలపై ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ అధ్యక్షుడు?
  - విజయ్ కేల్కర్
- రాష్ట్ర ప్రభుత్వాలు విధించే ప్రత్యక్ష పన్నుల్లో ముఖ్యమైంది?
  - భూమి శిస్తు
- కేంద్ర ప్రభుత్వానికి అధిక రాబడినిచ్చే పన్ను?
  - కార్పొరేషన్ పన్ను
- 2008-09లో పన్నులు-జీడీపీ నిష్పత్తి శాతం?
  - 12.9 శాతం

- భారతదేశంలో పన్ను విధానం అసమర్థతతోను, అసమానతలను పెంపొందించే విధంగా ఉందని చెప్పింది?

  – కాల్డర్
- 2008–09 బడ్జెట్‌లో సర్వీసులపై పన్ను రాబడి అంచనా?

  – రూ. 64,460 కోట్లు
- 2008–09 బడ్జెట్‌లో కార్పొరేషన్ పన్ను ఆదాయ అంచనా

  – రూ. 2,26,361 కోట్లు
- వ్యవసాయాదాయ సంపదలపై పన్నువిధింపు కమిటీ?

  – కె.ఎన్. రాజ్ 1972
- పరోక్ష పన్నుల విచారణ కమిటీ?

  – ఎల్.కె.ఝా, 1976, జూలై.
- ప్రత్యక్ష పన్నుల విచారణ కమిటీ?

  – మార్చి ,1970
- భూతలింగం కమిటీ ఎప్పుడు ఏర్పాటైంది?

  1967
- 'పన్ను విధాన ప్రకటన ప్రభా వం' అనే భావన చెప్పింది?

  – A.C. Pigou (పిగూ)